క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నెలవారి విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బెజ్జూర్: బెజ్జూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు


మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్, కోయచిచ్చాల గ్రామాల్లో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది శుక్రవారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది మాధురి, హెచ్‌ఏ ధర్మయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'చిరుధాన్యాల్లో కాల్షియం అధికం'


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కుమారి

కెరమెరి: చిరుధాన్యాల్లో కాల్షియం అధికంగా ఉంటుందని కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు అధికంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుమారి, లత అన్నారు. పోషక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కెరమెరి, గోయగాం, కరంజివాడ సెక్టార్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ఆరోగ్యానికి పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కిశోర బాలికలకు కిశోరామృతం పంపిణీ చేశారు. సర్పంచ్ బైనాబాయి, ఉపసర్పంచ్ నిసార్, పంచాయతీ కార్యదర్శి భీమయ్య, అంగన్‌వాడీలు ఉన్నారు.

చింతలమానెపల్లి: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని బాలాజీ అనుకోడ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం కిశోరామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీలు శోభారాణి, సత్తమ్మలు పాల్గొన్నారు.

బీసీలకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి


టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న శ్రీశైలం

చింతలమానెపల్లి: సిర్పూర్ నియోజకవర్గంలో అధికంగా ఉన్న బీసీ కులస్తులకే బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం డిమాండ్ చేశారు. ఆయన హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

శ్యామ్‌రావు దరఖాస్తు

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు సమర్పించినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లెండుగురె శ్యామ్ రావు తెలిపారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023- 24 విద్యాసంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత, సమాన అర్హత కలిగిన అభ్యర్థులు కాగజ్‌నగర్‌లోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈ నెల 30 వరకు గడువు ఉందని, మరిన్ని వివరాల కోసం 98663 98678, 94943 14314 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గాడితప్పుతున్న పాలన

- కీలక శాఖలకు ఇన్‌చార్జీలే దిక్కు
- రెగ్యులర్ తహసీల్దార్, వైద్యాధికారి లేక తిప్పలు
- టీజీబీ మేనేజర్ బదిలీతో బ్యాంక్ సేవలకు బ్రేక్


బెజ్జూర్ తహసీల్దార్ కార్యాలయం

బెజ్జూర్: మండలంలో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో సకాలంలో సేవలు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా శాఖల్లో ప్రభుత్వం నియమించిన ఇన్‌చార్జీలు పూర్తిస్థాయిలో ఇక్కడ పని చేయలేకపోతున్నారని దీంతో ప్రజలకు న్యాయం జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలో తహసీల్దార్, పశువైద్యాధికారి, టీజీబీ మేనేజర్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు.

మండలానికి వచ్చేందుకు విముఖత..

మండలంలో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి గత ఆగస్టు 8న బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమించిన అధికారి ఇక్కడికి రావడానికి విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆయా తహసీల్దార్లను బెజ్జూర్‌కు వెళ్లాలని ఉన్నతాధికారులు చెబుతున్నా వారు ససేమిరా అంటున్నట్లు సమాచారం. దీంతో నెలరోజుల నుంచి డెప్యూటీ తహసీల్దార్ బ్రహ్మేశ్వరరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్నారు.

పశు వైద్యాధికారి లేక ఇబ్బందులు..

మండల కేంద్రంలో పశు వైద్యాధికారి లేకపోవడంతో రైతులు, పాడి పోషకులు అనేక అవస్థలు పడుతున్నారు. గత రెండేళ్లుగా ఇక్కడ రెగ్యులర్ పశువైద్యాధికారి లేకపోవడంతో పెంచికల్‌పేట పశువైద్యాధికారి రాకేశ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాకాలంలో గాలికుంటు వ్యాధి, సీజనల్ వ్యాధులతో పశువులు అల్లాడిపోతున్నాయని పేర్కొంటున్నారు.

రైతులకు అందని బ్యాంక్ సేవలు

బెజ్జూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మూడు నెలల క్రితం అనారోగ్య కారణాలతో మెడికల్ లీవ్ తీసుకున్నారు. మేనేజర్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేయగా.. పెంచికల్‌పేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్‌ను ఇక్కడ ఇన్‌చార్జి మేనేజర్‌గా నియమించారు. రెగ్యులర్ మేనేజర్ కావడంతో రైతులకు రుణాల రెన్యూవల్‌లో ఇబ్బందులు తప్పడం లేదు. ఇన్‌చార్జి మేనేజర్ కావడంతో సకాలంలో సేవలు అందడం లేదని బ్యాంకు ఖాతాదారులు వాపోతున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై ఇటీవల పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. కుంటలమానేపల్లి ప్రధానోపాధ్యాయుడు ఇక్కడ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. సదరు ఉపాధ్యాయుడు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధ్యాయులు స్థానికంగా ఉంటూ విద్యా బోధన చేయాల్సి ఉన్నా అలా జరగడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆదివాసీలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న మడావి భరత్

కెరమెరి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ టికెట్ ఆదివాసీలకే ఇవ్వాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వివిధ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలకు కాకుండా ఇతరులకు టికెట్ ఇస్తే గ్రామాల్లోకి రానివ్వమని స్పష్టం చేశారు. జిల్లాలోని ఆదివాసీ మనోభావాలు దెబ్బతీయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సిడాం ధర్మూ, సెడ్మకి తుకారాం, ఎల్లయ్య, కినక శంకర్, జల్పత్‌రావు, మడావి చిన్ను, పూసం రాము తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన సర్వర్‌ఖాన్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్‌లు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట సర్పంచ్ అన్సార్ హుస్సేన్, బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, ఉపాధ్యక్షుడు ఇస్తారి, ఖాజా మోయినొద్దీన్, మహిళా అధ్యక్షురాలు అమృత, జ్యోతి, రమేశ్, మోహన్, శేఖర్, సల్మాన్ ఖాన్, రాకేశ్, రంజిత్, నీలయ్య, పోషం, సారయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'అమరవీరులను స్మరించుకుందాం'


కొత్తగూడలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: అమరవీరుల చరిత్రలను నేటి యువతరానికి తెలియజేయాలనే సంకల్పంతో ఢిల్లీలో ఈనెల 29న అమరవీరుల అమృత వాటిక నిర్మాణానికి ప్రతీ గ్రామం నుంచి పిడికెడు మట్టి సేకరిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని కొత్తగూడ, ఎల్లూర్ గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేసి మట్టి సేకరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, జిల్లా కోశాధికారి అరుణ్‌కుమార్, కుకుడే రాజేశ్వర్, నగేశ్, లహాన్‌రాజ్, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


రెబ్బెన: నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

రెబ్బెన: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఓదెలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ నాయకులు సత్తయ్య, కార్యదర్శి రాజేశ్వరి, తిరుపతమ్మ, బాలమ్మ, శ్యామల, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బెజ్జూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ బ్రహ్మేశ్వరరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రతినెలా రూ.26వేల వేతనం చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే 11వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

ఒంటికాలిపై నిల్చొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన


ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ హెచ్చరించారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 9వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. నాయకులు మధుకర్, సదాలక్ష్మి, సదానందం, సాయి, షకిల్, శ్రీదేవి, మమత, వెంకటేష్, కవిత, సౌందర్య, సంగీత, రజని, అనూష, సంధ్య, సరిత, సులోచన, చామంతి, ముస్తాఖ్, మాయ, చంద్రకళ పాల్గొన్నారు.

'భగీరథ' కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మిషన్ భగీరథ కాంట్రాక్టు ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకుడు లోకేష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 7వ రోజుకు చేరింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, రవీందర్, భీంరావ్, విజయ్ పాల్గొన్నారు.

కెరమెరి: సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం మిషన్ భగీరథ కార్మికులు మహాత్మా జ్యోతిబాపూలే, మహాత్మ గాంధీ విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆనంద్, భగీరథ కార్మికులు బుడ్డయ్య, భీంరావు, చరణ్, రాజు, ప్రేమ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

జైనూర్: మిషన్ భగీరథ కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులు భిక్షాటన చేపట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో ప్రభుదయకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిద్దు, ఈశ్వర్, నివర్తి, జుగాదిరావు, బాలాజీ, చందు, అంకుష్, సత్యవాన్, సురేశ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మేరీమాత పండుగ


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

కౌటాల: మండలంలోని విజయనగరం గ్రామంలో గల క్యాథలిక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం మేరీమాత పండుగ నిర్వహించారు. గ్రామంలోని క్రైస్తవులు చర్చి ఆవరణలో మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఫాదర్లు సీజో, బైజు, సతీశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


బ్రహ్మయ్యను సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్: ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సోమిని గ్రామానికి చెందిన కోండ్ర బ్రహ్మయ్యను స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. వారు మాట్లాడుతూ మారుమూల గ్రామం సోమిని నుంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడం గొప్ప విషయమన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు చేస్తున్న సమ్మె 12వ రోజుకు చేరుకుంది. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి నగేశ్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేశ్, ధర్మయ్య, శ్రీనివాస్, రవి తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'


బూత్ కమిటీ సభ్యులతో కాంగ్రెస్ నాయకులు

జైనూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని మండల నాయకుడు అబ్దుల్ ముకీద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంలొద్ది, ఊశేగాం గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో సుద్దాల శ్రీనివాస్, భుజంగ్‌రావు, సిద్దేశ్వర్ తదితరులు ఉన్నారు.

తపాలా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జైనూర్: తపాలా శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ సబ్ డివిజన్ మెయిల్ వర్సి రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో బీపీఎంలకు అవగాహన కల్పించారు. ఎస్పీఎం జ్యోత్స్న, బీపీఎంలు సంతోశ్, గజానంద్, నల్లేరావు, అనిల్, లక్ష్మణ్, రోహిత్, సౌజన్య, సౌమ్య, కృష్ణ ఉన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కృష్ణుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్రా జగ్గాగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, భక్తులు సత్యనారాయణ, శ్రీనివాస్, జనార్దన్, నిలేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు


బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ వార్డ్ నం.1, 2కు చెందిన సీనియర్ నాయకులు సంజయ్ సింగ్, లలిత్‌ల ఆధ్వర్యంలో చెడ్డ గారి కుటుంబంతో పాటు ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, యువ నాయకులు కోనేరు ఫణి, కౌన్సిలర్ మినాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానిస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో మనుకుమార్‌తో కలిసి జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనన్నారు. ఎంపీపీ మల్లికార్జున్, ఎంపీవో ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీయూ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో పనిచేస్తున్న కుక్, వాచ్‌మెన్, కామాటితోపాటు ఇతర కార్మికులకు 12 నెలల వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్మికులు తిరుపతి, పార్వతి, లలిత, జ్యోతి తదితరులు ఉన్నారు.

బాక్సింగ్ ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ జెడ్పీ పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ -14, 17 విభాగంలో మొత్తం 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్ -14 విభాగంలో 11 మంది, అండర్ -17 విభాగంలో 13 మంది ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సాంబశివరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ శేఖర్, నరేందర్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, సీనియర్ బాక్సింగ్ కోచ్‌లు ఏడుకొండలు, సాయి, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు సక్రమంగా విద్యుత్ అందించడం లేదని ఆరోపించారు. వెంటనే రుణమాఫీ చేసి తిరిగి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు చారి గులాబ్‌రావు, సురేశ్‌కుమార్, దేవేందర్, రాంచందర్ పాల్గొన్నారు.

టీఆర్‌టీ ఉచిత శిక్షణ

కాగజ్‌నగర్‌టౌన్: కోనేరు కోనప్ప, కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత టీఆర్‌టీ శిక్షణ కల్పించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ తెలిపారు. ఈనెల 20 నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440552821, 93902 23911లపై సంప్రదించాలని కోరారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి పాటుపడాలి

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాలన్‌గొంది గ్రామాన్ని సందర్శించి నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి స్థలం పరిశీలించారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ పార్వతి, ఎంపీవో ప్రసాద్, నాయకులు తిరుపతి, బీము, సోము, బాదు పటేల్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

బెజ్జూర్: మండల కేంద్రం నుంచి ఎలుకపెల్లి, సిద్దాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారి వర్షాలకు బురదమయంగా మారి కాలినడక కూడా కష్టంగా మారిందని 'దారి ఇలా.. నడిచేదెలా' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ఫొటోస్టోరీ ప్రచురితమైంది. దీనికి సిద్దాపూర్ సర్పంచ్ రవి స్పందించారు. చిత్తడిగా మారిన రోడ్డుపై సర్పంచ్ ఇసుక పోయించి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి హేయమైన చర్య

కాగజ్‌నగర్‌టౌన్: సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులపై కొంత మంది ఏబీవీపీ గుండాల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దిగిడ ప్రకాశ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ సంఘానికి చెందిన దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జ్వరంతో వృద్ధురాలు మృతి

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన సఫియా బేగం (65) జ్వరంతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న సఫియా బేగంను మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందిందని వారు పేర్కొన్నారు.